క్లుప్తంగా

రైతులకు పెట్టుబడి సాయం రూ. 20వేలు అందించాలి

పాణ్యం: రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం మండల కన్వీనర్ బోయ ఎల్లక్రిష్ణుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వీఆర్‌ఓ బీరేంద్రకు నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ. 20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని నాయకులు విస్మరించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుల్లయ్య, నరసింహులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేపట్టకపోతే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

సి.బెళగల్: గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని ఏపీడీ అల్లిపీర హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీఏలు, ఎఫ్‌ఏలు, సిబ్బందితో ఏపీఓ రామన్నతో కలిసి ఏపీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీల సంఖ్య, ప్రస్తుతం పనులకు వస్తున్న వారి నివేదికలను గ్రామ పంచాయతీల వారీగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి పనులు చేసుకునే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో జేఈ రంగస్వామి, టీఏలు మురళీ, రామ్మోహన్, గోవర్ధన్, రాజశేఖర్, ఉమా, ఎంసీఓలు, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

పాణ్యం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే ఏకాగ్రత ముఖ్యమన్నారు. పోటీ ప్రపంచంలో నిలవాలంటే భిన్నమైన ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలు ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఉల్చాల విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఉల్చా ల గ్రామానికి చెందిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నంద్యాలలో నిర్వహించిన అండర్–17 విభాగంలో జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో విష్ణుప్రియ, రాణి, ప్రసన్నకుమారి, అమూల్య ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయురాలు సత్తార్ ఉన్నీసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు వ్యాయా మ ఉపాధ్యాయులు సిరాజ్, విజయభాస్కర్ యాదవ్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడా పరికరాల పంపిణీ

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని పంచలింగాల గ్రామానికి చెందిన క్రీడాకారిణులకు బుధవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు దంపతులు క్రీడా పరికాలు పంపిణీ చేశారు. హాకీ బ్యాట్లు, బాల్స్, బూట్లు, షిన్‌గార్డ్స్ అందజేశారు. నెల్లూరు, కాకినాడ జిల్లాలో జరిగే అండర్–14, అండర్–19 పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనపరచి జిల్లాకు పేరుతేవాలని ఈ సందర్భంగా వారికి ఎంపీ సూచించారు.

సంతాపం

ఓర్వకల్లు: పశ్చిమగోదావరి జిల్లా, అగిరిపల్లి హిల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమంలో అదే జిల్లా ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నకుమార్ గుండె పోటుతో మృతి చెందారని ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న రాఘవేంద్ర బీఈడీ శిక్షణ కళాశాలలో జరుగుతున్న కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయుల శిక్షణా శిబిరంలో రత్నకుమార్ మృతికి ప్రధానోపాధ్యాయులు సంతాపం తెలిపారు. కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేటప్పుడు వయసు, ఆరోగ్య పరిస్థితులను ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకోవాలని ఈ సందర్భంగా శ్రీనివాసయాదవ్ కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, వివిధ జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా.. ‘పొలం పిలుస్తోంది’

- కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు
- రైతులకు అందని సలహాలు, సూచనలు
- వెల్లువెత్తుతున్న విమర్శలు


పోలకల్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు

సి.బెళగల్: వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న ‘పొలం పిలుస్తోంది’ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరుకావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు కొన్ని శాఖల అధికారులు హాజరైనా ఇలా వచ్చి... అలా వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆహార, వాణిజ్య, పండ్లు, పూల తోటలు, పట్టు, మత్స్యసంపద తదిర సాగు రైతులకు ఉన్న సందేహాలను తీర్చి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేలా చైతన్య పరిచేందుకు ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్నారు. అయితే సి.బెళగల్ మండలంలో వ్యవసాయ అధికారులు మాత్రమే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులతో మాట్లాడుతున్నారు. అనుబంధ శాఖల అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కావడంలేదు. వ్యవసాయ శాఖతో పాటు, ఆత్మ, సెరికల్చర్, ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, ఏపీసీఎస్‌ఎఫ్, కోపరేటీవ్ ఫెడరేషన్, మత్స్య శాఖ, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయ తదితర సుమారు పది శాఖల అధికారులు విధిగా హాజరుకావాల్సి ఉంది. వాస్తవానికి ఒకటి, రెండ శాఖల అధికారులు మొక్కుబడిగా వస్తున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది మాత్రంలో రైతు సేవా కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రైతుల నుంచి స్పందన లేదు. దీంతో మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహించి ఫొటోలు దిగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొలం పిలుస్తోంది షెడ్యూల్ ఇది....

సెప్టెంబర్ నెల 24వ తేదినా ప్రారంభమైన పొలం పిలుస్తోంది కార్యక్రమం 2025 సంవత్సరం జనవరి నెల 2వ తేది వరకు పల్లెల్లో నిర్వహించాల్సి ఉంది. వారంలో రెండు రోజుల పాటు మంగళ, బుధవారాలలో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. రోజుకు రెండు గ్రామాల్లో చొప్పున ప్రతి వారం నాలుగు పల్లెల్లో నిర్వహించాల్సి ఉంది. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలోని 21 గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించేందకు మండల వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించినా ఫలితం కనిపించం లేదు.

రైతుల పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి...

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు చర్యలపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. అదేవిధంగా నూతన సాగు పద్ధతులు, మేలు రకాల వంగడాలు, ఉత్తమ సాగు ఫలితాలపై అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను చైతన్య పరచాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల అనుమానలను తీర్చాల్సి ఉంటుంది. అయితే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. దీంతో పండ్లు, పూల తోటలు సాగు రైతులకు సూచనలు, సలహాలు ఏ మాత్రం అందడంలేదు. ఖరీఫ్‌లో రెగ్యులర్ పంటలతో పాటు మిరప, ఉల్లి, మామిడి, జామ, సపోట, కొబ్బరి, నిమ్మ వంటి పంటలు సాగులో ఉన్నాయి. రబీ సీజన్ కూడా మొదలైంది. ఈ పరిస్థితులలో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అండగా నిలవాల్సి ఉంది. అయితే అలా జరగడం లేదు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎంపిక చేసిన రైతుల పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి అన్నట్లుగా సాగుతోంది ‘పొలం పిలుస్తోంది’.

సారోళ్లు రైతుల దగ్గరకు రావడం లేదు


పండ్లు, పూల తోటలకు ముందుకు రావాలని రైతులను అధికారులు వెంటపడి పంటలను నాటిస్తారు. మొక్కలు నాటుకున్నాక సంబంధిత అధికారులు ఎవ్వరుకూడా రైతుల దగ్గరి రావడం లేదు. పండ్ల తోటలను సాగు చేసుకున్న మాలాంటి రైతులు వాటిని ఎలా కాపాడుకొవాలో తెలియక అవస్థలు పడుతున్నాం. పండ్లు, పూలతోటల పంటల సంరక్షణ, మంచి దిగుబడులు ఎలా సాధించాలన్న కొత్త విషయాలు తెలియడం లేదు.
– చిన్న సోమన్న, ఉద్యానవన రైతు, బురాన్‌దొడ్డి గ్రామం

రైతులకు అందుబాటులో ఉండాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు సంబంధిత అధికారులు సక్రమంగా హాజరు కావడం లేదు. ఆయా శాఖలు పాల్గొని ప్రభుత్వ పథకాలు, పంటల సంరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేస్తే బాగుంటుంది. ప్రత్యేక కార్యక్రమాలకు సైతం అధికారుల హాజరవకపోవడం మంచిది కాదు. ఇప్పటికైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి.
– నాయకంటి మంగమ్మ, వైస్ ఎంపీపీ

అన్ని శాఖలకు సమాచారం ఇచ్చాం

ప్రతివారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కార్యక్రమ నిర్వహణపై అన్ని శాఖల అధికారులకు షెడ్యూల్ పంపించాం. అదేవిధంగా ఆయా గ్రామాల రైతులకు సైతం ముందురోజే కార్యక్రమంపై సమాచారం ఇస్తున్నాం. కొన్ని గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆత్మా, ఉద్యానవన, సెరీ కల్చర్ అధికారులు మాత్రం వచ్చారు. రైతులకు అన్ని రకాల సలహాలు, సూచనలు ఇస్తున్నాం.
– మల్లేష్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, సి.బెళగల్

సమస్యలు పరిష్కరించండి

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డులలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగరపాలక కౌన్సిల్ సమావేశ భవనంలో కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధిపై కమిషనర్ రవీంద్రబాబు నేతృత్వంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్లూరు అర్బన్ ప్రాంతంలో కొత్త కాలనీలు అధిక సంఖ్యలో ఉన్నాయని, అందులో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. అత్యవసరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తూ, వాటన్నింటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎస్‌ఈ రాజశేఖర్, ఆరోగ్యధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌ఓ జునైద్, ఎంఈలు శేష సాయి, సత్యనారాయణ, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నటేకూరులో గ్రామ సభ

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో బుధవారం భూ సమస్యలపై తహసీల్దార్ ఆంజనేయులు గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సోమన్న, మండల సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాలలో చదుతున్న విద్యార్థులకు కొన్ని రోజుల నుంచి తాగునీటి సమస్య ఉండటంతో హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ సూచన మేరకు సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి స్పందించారు. బుధవారం పాఠశాల సమీపంలో ఉన్న బోరింగ్‌కు సింగిల్ ఫేస్ మోటర్‌ను బిగించారు. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగునీటి సమస్య తీరింది. సర్పంచ్‌కు విద్యార్థులు,ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోదా ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు నిర్మాణ పనుల మార్కింగ్‌ను ఏఈ ముక్తర్ బాషాతో కలిసి పరిశీలిస్తున్న డీఈ కర్రెన్న

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని పడిదెంపాడు, బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు గ్రామాల్లో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఏఈ ముక్తర్ బాషా రోడ్డు పనులకు సంబంధించి మార్కింగ్ వేయించారు. మార్కింగ్ తీరును డీఈ కర్రెన్న పరిశీలించారు. రోడ్లు నాణ్యతగా చేపట్టేలా పర్యవేక్షించాలని ఏఈకి ఈ సందర్భంగా డీఈ సూచించారు.

నాణ్యమైన విద్యను అందించాలి


కొటారుమిట్ట స్కూల్‌లో ఉపాధ్యాయుల హాజరును పరిశీలిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని కంబదహాల్ మేయిన్, బీసీ, సి.బెళగల్ కొటారుమిట్ట, పోలకల్ మేయిన్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించారు. ఎంఈఓ విద్యార్థుల నోట్ బుక్‌లను తనిఖీ చేశారు. పాఠ్యాంశాల బోధన, తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, హనుమన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: ప్రత్యేక ఓటరు నమోదు, సవరణలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ తహసల్దార్ పురుషోత్తం ఓటరు నమోదు కార్యక్రమ నిర్వహణపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన తహసీల్దార్ బీఎల్వోలను ఉద్దేశించి మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈనెల 9, 10, 16, 17వ తేదీలలో మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలలో బీఎల్వోలు ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. ఫారం –6, ఫారం – 7, ఫారం – 8, 8ఏ అవసరాలు, ఓటు నమోదు అంశాలను వివరించి, ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని చెప్పారు.

రైల్వే నోటిఫికేషన్ విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను రిటైర్డ్ అయిన ఉద్యోగులతో కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమని, వెంటనే ఆ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యేటేటా దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుంటే..వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం ఆటలు ఆడుతోందన్నారు. అడపాదడపా నోటిఫికేషన్‌లు వచ్చే రైల్వే రంగంలోనూ రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న 2.98 లక్షల ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగప్ప, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధిద్దాం

కర్నూలు(సెంట్రల్): అమరవీరుల ఆశయాల సాధన కోసం ఉద్యమిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని గోకారి భవన్ లో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ముందుగా అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుత్తి, కొడవలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏటా విప్లవ కారులను మననం చేసుకోవడం కోసం అమరవీరుల స్మారక సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు దామోదర్, రాజు, మౌలాబీ,రేణుకచ ఫాతిమా, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

దమ్ముంటే.. ఆరోపణలు నిరూపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

- టీడీపీ నేతలకు 23వ వార్డు కార్పొరేటర్ సవాల్
- వృద్ధురాలిపై దాడిని మంత్రి సమర్థిస్తున్నారా? అని నిలదీత

కర్నూలు (టౌన్): ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులకు దమ్ముంటే వాటిని నిరూపించాలని వైఎస్సార్‌సీపీ 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి, పార్టీ వార్డు ఇన్‌చార్జ్ కటారి సురేష్ కుమార్ సవాల్ విసిరారు. ఇంట్లో ఉన్న 75 ఏళ్ల వృద్ధురాలిపై దాడి చేసిన టీడీపీ మాజీ కార్పొరేటర్ గున్నామార్కు తమ్ముడిని మంత్రి టీజీ భరత్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ హాలులో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమస్యను పక్కదారి పట్టించేందుకే టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాము అక్రమాలు చేసిఉంటే అధికారంలో ఉన్న టీడీపీ విచారణ చేయించవచ్చు కదా? అని నిలదీశారు. సి.క్యాంపు మున్సిపల్ పాఠశాల వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన బంకుల వల్ల విద్యార్థినులకు ఇబ్బంది కలుగుతోందని, దీనిపై మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కౌన్సిల్ సమావేశంలో మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రికి చెప్పినందుకే తమ ఇంటిపైకి వచ్చి దాడి చేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని, దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ.. సమస్యపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. బంకులను తొలగించాలని, వృద్ధురాలిపై దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించకుంటే భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు యూనూసు బాషా, జుబేర్ అహమ్మద్, కార్పొరేటర్లు షాషావలీ, క్రిష్టాకాంత్, రాజేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేయండి

కర్నూలు (టౌన్): స్థానిక వినాయక్‌ఘాట్‌లో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్‌లో నగరపాలక, అగ్నిమాపక, విద్యుత్, జలవనరులు, మత్స్యశాఖ, పోలీసు శాఖ, కార్తీక దీపోత్సవ కమి టీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కార్తీక దీపోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. లైటింగ్, మహిళా పోలీసు, గజ ఈతగాళ్లు, ఫైరింజన్ వంటివి అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి


పోలకల్‌లో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి


శనగ సాగు మెలకువలను వివరిస్తున్న కిషోర్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రూసఫ్ రొనాల్డ్

సి.బెళగల్: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పోలకల్, మారందొడ్డి గ్రామాల్లో ఏఓ మల్లేష్ కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పోలకల్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఆర్‌సీ ఏడీఏ అన్నపూర్ణాదేవితో కలిసి హాజరైన ఏడీఏ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పంట పొలాలను పరిశీలించారు. పంట సాగు సమాచారం, సంరక్షణ చర్యలను డీఆర్‌సీ ఏడీఏ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ భరత్, ఆఫ్రీన్, భాష్కర్ రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోడుమూరు రూరల్ : శనగ పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని డాట్ సెంటర్ శాస్త్రవేత్త కిషోర్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో ఏఓ రవి ప్రకాష్ రైతులతో కలిసి శనగ, జొన్న, కంది పంటలపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాట్ సెంటర్ శాస్త్రవేత్త కిషోర్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం ఏఓ నాగసరోజమ్మ హాజరై పంటల సాగులో మెలకువలను రైతులకు వివరించారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ శనగ పంటలో తెగుళ్ల నివారణకు ఇమామెక్టిన్ బెంజోను ఎకరాకు 100గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. కందిపంటకు గూడు పురుగు నివారణ కోసం నువ్వల్ నురాన్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేసుకోవాలని, పూత రాలకుండా ఉండేందుకు 14–0–35ను ఎకరాకు 2కిలోల చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్నశాస్త్రవేత్త సుజాతమ్మ

ఓర్వకల్లు: పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కర్నూలు జిల్లా ఏరువాక కేంద్రానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త సుజాతమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామంలో పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్త సుజాతమ్మ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సాధారణంగా పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నవంబర్ నుంచి సంక్రమిస్తోందన్నారు. దీని నివారణకు థయోడికార్బ్ 1.5 గ్రాములు/ప్రొఫైనోఫాస్ 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం కర్నూలు జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, అసిస్టెంట్ డైరెక్టర్ గిరీష్ పత్తి సాగు మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, వీఏఏ ఆనందలక్ష్మి పాల్గొన్నారు.

దిగువపాడులో పొలం పిలుస్తోంది

కర్నూలు(రూరల్) : కర్నూలు మండల పరిధిలోని దిగువపాడు, గార్గేయపురం గ్రామాల్లో బుధవారం ఏఓ రూసఫ్ రొనాల్డ్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సమావేశమైన ఏఓ సాగు మెలకువలను వివరించారు. పొగాకు పైరుకు చీడపీడలు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ సూచించారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి


ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఓర్వకల్లు: పారిశ్రామిక వాడలో నెలకొల్పే పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గుట్టపాడు భూ నిర్వాసిత కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమానికి రామకృష్ణతో పాటు, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టపాడు గ్రామం వద్ద నెలకొల్పుతున్న జైరాజ్ ఇస్పాత్ ఉక్కుపరిశ్రమలో తొలి విడత కింద సుమారు 400 ఎకరాలను రైతులు కోల్పోయారని తెలిపారు. మరో మూడు నెలల్లో ఉత్పత్తి ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతు కుటుంబ సభ్యులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. ఎండీ దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల్లో పరిష్కరిస్తామని సీఈఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు షాజాహాన్, సుధాకర్, మద్దిలేటి, రామకృష్ణ, కృష్ణుడు, గుండమయ్య, మహ్మద్‌బాష, శివకుమార్, బాలమద్దిలేటి, నాగశేషులు, షేక్షావలి, సుధాకర్, మాలిక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

ఓర్వకల్లు:మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానం ప్రాంగణంలో ఏడాదిపాటు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈ నెల 6వ తేదీన నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాటలు అనివార్య కారణాల మూలంగా వాయిదా వేసినట్లు ఈఓ మద్దిలేటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలు తిరిగి ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.